నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ విత్తనం



రాయితీ విత్తన వేరుశనగ కాయలు



తాడిమర్రిలోని రైతు భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ కృష్ణయ్య

- ఆర్బీకేలలో నేటి నుంచి రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ
- ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య

తాడిమర్రి: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య రైతులను కోరారు. వేరుశనగ సాగు చేయనున్న రైతులకు బుధవారం నుంచి విత్తన పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. నార్సింపల్లి, తాడిమర్రి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. విత్తన నాణ్యత, విత్తనం కోసం ఎంతమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారనే వివరాలను వ్యవసాయ అధికారి రమాదేవిని అడిగారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 27 తేదీ వరకు 2,031 క్వింటాళ్ల విత్తనం కోసం 2,283 మంది రైతులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకూ విత్తనం పంపిణీ చేస్తామని తెలిపారు. ధర్మవరం వ్యవసాయ డివిజన్ పరిధిలో తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలు ఉండగా 71 ఆర్‌బీకేలు ఉన్నాయన్నారు. 15,069 క్వింటాళ్ల కేటాయించగా 8,983 మంది పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వీఏఏ ఓబుళమ్మ, వీఎస్ఏ విజయ్‌భాస్కర్, వీహెచ్ఏ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: మండలంలోని అన్ని ఆర్బీకే కేంద్రాల్లో బుధవారం నుంచి విత్తన కాయల పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి వెంకటరమణాచారి పేర్కొన్నారు. ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతులు కాయలను తీసుకోవచ్చన్నారు.

తనకల్లు: మండల వ్యాప్తంగా 14 రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం నుంచి రాయితీ వేరుశనగను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ తెలిపారు. 4,617 క్వింటాళ్లు కేటాయించగా మొదటి విడతగా 1385 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేయడానికి సిద్ధం చేసామని పేర్కొన్నారు.

తలుపుల: మండలంలో రాయితీ విత్తన వేరుశనగను బుధవారం నుంచి ఆర్బీకేలలో పంపిణీ చేయనున్నట్లు ఏఓ షాదాబ్ తెలిపారు. మండలానికి 3850 క్వింటాళ్లు కేటాయించగా తొలివిడతగా 100 క్వింటాళ్లు చొప్పున ఆర్బీకేలకు వచ్చాయన్నారు.

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు రాయితీతో అందిస్తున్న విత్తన వేరుశనగ కాయలను బుధవారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు బత్తలపల్లి వ్యవసాయాధికారి ఓబిరెడ్డి తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో విత్తన కాయల కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతులకు విత్తన కాయలు పంపిణీ చేస్తామని తెలిపారు. అదేవిధంగా విత్తన కాయల కోసం పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు బుధవారం మధ్యాహ్నం 2గంటలనుంచి వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు మండల ఏఓ భారతి తెలిపారు.

ధర్మవరం రూరల్: పేర్లు నమోదు చేసుకున్న రైతులకు రైతు భరోసా కేంద్రాలలో బుధవారం నుంచి రాయితీ వేరుశనగ విత్తనం పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి ముస్తఫా తెలిపారు.

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా ఆర్‌బీకేలలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు బుధవారం నుంచి రాయితీతో వేరుశనగ అందించనున్నట్లు వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు తెలిపారు.

క్లుప్తంగా

నెలసరి సమయంలో శుభ్రత పాటించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: నెలసరి సమయంలో ప్రత్యేక పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ సరస్వతి కిశోర బాలికలకు సూచించారు. స్థానిక నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ లలితమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన బహిష్టు పరిశుభ్రత దినోత్సవానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది, బాలికలతో కలిసి పరిశుభ్రతను సూచించే పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకుంటేనే ఆరోగ్య కరమైన సమాజం నిర్మించగలమన్నారు. అనంతరం సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మ బాలికల భద్రత, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన పరిశుభ్రతపై వివరించారు. మహిళా పోలీసు జ్యోతిర్మయి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మీ, భారతి, అలివేలమ్మ, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ తల్లికి పూజలు



నల్లగంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలో వెలసిన నల్ల గంగమ్మ తల్లి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారి చాందినీ బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయాన్నే భక్తులు చన్నీటి స్నానం ఆచరించి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలు, నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ చేసి చల్లగా చూడాలి తల్లీ అంటూ పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సాయిరాం మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ సీ.ఎం.సాంబశివారెడ్డి, సర్పంచ్ ఆంజినమ్మ, శ్రీరాములు, హెల్త్ అసిస్టెంట్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సజావుగా పది సప్లిమెంటరీ పరీక్షలు

ఓడీచెరువు: మండలంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగాయి. మంగళవారం జరిగిన గణితం పరీక్షకు జెడ్పీ పాఠశాలలో 74 మందికి గాను 45 మంది, విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో 84 మందికి గాను 45 మంది హాజరైనట్లు డీఓలు రిజ్వానుల్లా ఖాన్, రవీంద్రనాయుడు తెలిపారు.

కొల్లాపురమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో కొల్లాపురమ్మ

బత్తలపల్లి: బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొని మొక్కులను సమర్పించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

3 వరకు సర్వీస్ ఓట్ల స్వీకరణ



ఆర్డీఓ కార్యాలయంలో సర్వీస్ ఓటర్ల బాక్సు గది వద్ద బందోబస్తులో పోలీసులు

ధర్మవరం అర్బన్: సర్వీస్ ఓట్లను జూన్ 3వ తేదీ వరకు పోస్టల్ ద్వారా స్వీకరించనున్నామని ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో సర్వీస్ ఓటర్లు 258 మంది తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అనుమతినిచ్చిందన్నారు. ఈనెల 28వ తేదీన సాయంత్రం వరకు 115 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రిజిస్టర్ పోస్టు ద్వారా కార్యాలయానికి చేరాయన్నారు. మిలటరీ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నామని తెలిపారు. వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌లను ప్రత్యేకమైన ఒక బాక్స్‌లో భద్రపరిచి సీలు వేశామని తెలిపారు. 24గంటలపాటు పోలీసు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల తనిఖీలు



చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లిలో గడ్డివాముల్లో సోదాలు చేస్తున్న పోలీసులు



బత్తలపల్లి మండలం పోట్లమర్రిలో సోదాలు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది



గాండ్లపెంట మండలం బొలిగుట్లపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ క్రిష్ణవేణి

బత్తలపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్న నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు మంగళవారం తమ సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు పోట్లమర్రి గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో, ప్రదేశాల్లోనూ, మద్యం విక్రయిస్తున్న వారి ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, ఘర్షణలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితాలు వెలువడిన అనంతరం గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు. సంబరాలు, విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. బాణాసంచాలు కాల్చడం వంటి చర్యలు చేపట్టవద్దన్నారు. ఇంటిలో ఉండాలని, బయటకు వచ్చి అవాంఛనీయ సంఘటనలకు వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు దిగితే కేసులు నమోదు

చెన్నేకొత్తపల్లి : ఓట్ల లెక్కింపు రోజున ఘర్షణలకు దిగితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రజలను హెచ్చరించారు. పులేటిపల్లిలో మంగళవారం ఉదయం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అనుమానితులు, పాత లిక్కర్ కేసులు ఉన్న వారి ఇళ్లతో పాటు వారి ఇంటి పరిసర ప్రాంతాలలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో ఎస్ఐ సమావేశమై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు మండల వ్యాప్తంగా 144 వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎక్కడైనా గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గాండ్లపెంట: సోమయాజులపల్లి గ్రామ పంచాయతీ బోలిగుల్లపల్లిలో ఎస్ఐ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వరిగడ్డి వాముల్లో, అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరూ కూడా గుంపులుగా ఉండకూడదని, గొడవలకు వెళ్లరాదని గ్రామస్తులకు సూచించారు.

బత్తలపల్లిలో మూతపడిన దుకాణాలు



దుకాణాలను బంద్ చేసిన దృశ్యం

బత్తలపల్లి: బత్తలపల్లిలో మంగళవారం ఉన్నఫళంగా వివిధ దుకాణాలు మూత పడ్డాయి. ఉదయం ఏడు గంటలకే తలుపులు తెరుచుకునే దుకాణాలు ఒక్కటి కూడా తెరవలేదు. దీంతో సరుకుల కోసం వచ్చిన ప్రజలు అవాక్కయ్యారు. కాగా విజిలెన్స్ అధికారులు వస్తారనే సమాచారంతో దుకాణదారులు షాపులను మూసివేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. బత్తలపల్లి పెద్ద వ్యాపార కూడలి. బత్తలపల్లి చుట్టూ పెద్ద సంఖ్యలో గ్రామాలున్నాయి. ఎలాంటి సరుకులు కావాలన్నా ప్రజలు మండల కేంద్రానికి వస్తారు. దీంతో పెద్ద సంఖ్యలో రిటైల్, హోల్‌సేల్ కిరాణా, ఇతర దుకాణాలు ఏర్పాటయ్యాయి. వస్తువుల నాణ్యత, దుకాణాల అనుమతులు, నిర్దిష్ట ధరలకే విక్రయిస్తున్నారా? బ్లాక్‌లో విక్రయిస్తున్నారా? అనే విషయాలపై ఆరా తీసేందుకు అప్పుడప్పుడు విజిలెన్స్ అధికారులు వస్తుండటం పరిపాటి. అందులో భాగంగా మంగళవారం మండల కేంద్రానికి అధికారులు వస్తారనే సమాచారంతో దుకాణదారులు ముందు జాగ్రత్తగా షాపులను మూసివేసినట్లు తెలుస్తోంది. సాయంత్రం 6 గంటల వరకు దుకాణాలు తెరుచుకోలేదు.

కటారుపల్లి ఉపసర్పంచ్ మృతి



సయ్యద్‌హుస్సేన్(ఫైల్)

గాండ్లపెంట: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కటారుపల్లి గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సయ్యద్‌హుస్సేన్(50) అలియాస్ సైదు మంగళవారం మృతి చెందాడు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కటారుపల్లి పరిసర గ్రామాల్లో ఈ నెల 8న రాత్రి ప్రచారం ముగించుకుని కదిరికి బైక్‌లో వెళుతుండగా కమతంపల్లి వద్ద బొలెరో వాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన సైదును కదిరి ఆస్పత్రికి తరలించారు. 10 రోజుల తర్వాత వైద్యుల సలహా మేరకు బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంతాపం తెలిపిన మక్బూల్ అహ్మద్

సయ్యద్ హుసేన్ మృతి విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మక్బూల్‌అహ్మద్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. చురుకైన కార్యకర్తను కోల్పోయామని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి, మండల ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, మాజీ కన్వీనర్ దామోదర్‌రెడ్డి తదితరులు మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపుపై సర్వే



చెన్నేకొత్తపల్లిలో దివ్యాంగ విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రమణ

చెన్నేకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను చదువుకునేలా ప్రోత్సహిస్తోందని ఐఈఆర్టీ వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను గుర్తించేందుకు మండలవ్యాప్తంగా ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. సర్వే ఈనెల 1 నుంచి జూన్ 11 జరుగుతోందన్నారు. ఇందులో 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న దివ్యాంగులను గుర్తించి ప్రభుత్వ పాఠశాల్లో చేర్పిస్తామన్నారు. ఇప్పటి వరకూ 30 మందిని గుర్తించామని తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో జరిగిన సర్వేలో ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసన్నకుమార్‌నాయుడు దివ్యాంగ విద్యార్థిని బడిలో చేర్పించాలని అతడి తల్లికి సూచించారు. అవసరమైన విద్యార్థులను భవిత కేంద్రంలో చేర్పించి ప్రత్యేక సేవలు అందిస్తామన్నారు. ఉపాధ్యాయుడు నాగేంద్ర, సీఆర్పీలు కేశవ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను బడిలో చేర్పించండి

ఓడీచెరువు: దివ్యాంగ బాలలను బడిలో చేర్పించాలని ఎంఈఓ రమణ సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్ నియమించిన ప్రత్యేక ఉపాధ్యాయులు నాగశేఖర్, నరసింహబాబుతో కలిసి మంగళవారం ఆయన పలు గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ 0–18 సంవత్సరాల లోపు వయస్సున్నవారిని గుర్తించి ఆయా పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు రవాణాసదుపాయం, ప్రత్యేక బోధనాపరికరాలు అందించనున్నట్లు తెలిపారు. బడిబయట దివ్యాంగ పిల్లలు ఉన్నట్లయితే 9705761678 ఫోన్ చేయాలన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై శిక్షణ



చెన్నేకొత్తపల్లిలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



గాండ్లపెంటలో వీడియో ద్వారా అవగాహన

చెన్నేకొత్తపల్లి: స్థానిక కేజీబీవీలో మంగళవారం మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు మధ్యాహ్న భోజన నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ట్రైనర్ రాణి భోజన నిర్వహణపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసన్నకుమార్‌నాయుడు మాట్లాడుతూ పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభమవుతాయన్నారు. భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఆయా పాఠశాలల్లోని వంట గదులు, వంట సామగ్రిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయడంతో పాటు రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. వంట తయారు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కేజీబీవీ ఎస్‌వో సువర్ణ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'జగనన్న గోరుముద్ద' పథకం కింద మధ్యాహ్న భోజనం తయారు చేసే 58 మంది ఏజెన్సీ నిర్వాహకులకు మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వంటల తయారీ, శుభ్రత, కూరగాయాలు, ఆకుకూరల వినియోగం తదితర అంశాలపై రీసోర్స్ పర్సన్ హంసలేఖ వీడియో ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వంటల తయారీపై పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈఓ కృష్ణానాయక్ బహుమతులు అందించారు.

హడలెత్తించిన జెర్రిపోతు



పామును బంధిస్తున్న స్నేక్ క్యాచర్ మూర్తి

పుట్టపర్తి టౌన్: పట్టణ పరిధిలో జెర్రిపోతు హడలెత్తించింది. సాయినగర్ కాలనీలో లక్ష్మీదేవి అనే మహిళకు చెందిన ఇంటిలోకి మంగళవారం జెర్రిపోతు చొరబడింది. అది ఎక్కడ దాక్కుందో తెలియక ఇంటిలోని వారు హడలెత్తిపోయారు. తీరా చూస్తే పరుపు కింద తిష్టవేసి బుసలు కొడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ మూర్తి అక్కడకు చేరుకొని చాకచక్యంగా పామును బంధించి అటవీ ప్రాంతంలోకి వదిలేశారు.

భక్తిశ్రద్ధలతో జలధి పూజ



అక్కమ్మ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్కమ్మ దేవతల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జలధి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆత్మకూరు సమీపంలోని ఓ పొలంలో జలధి పూజ నిర్వహించారు. అక్కడ వేల మంది భక్తుల నడుమ పూజల అనంతరం అక్కమ్మ దేవతలున్న గంపను తలపై పెట్టుకొని ఆలయం వద్దకు చేరుకున్నారు. దారి పొడవునా భక్తులు అక్కమ్మ దేవతల గంపకు నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పూలమాలలతో అక్కమ్మ దేవతను అలంకరించి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేపట్టారు. బుధవారం ఆలయం చుట్టూ పన్నేరపు బండ్ల ప్రదక్షిణ, పరుష కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

మాజీ జెడ్పీటీసీకి గాయాలు

గాండ్లపెంట: బోలిగుట్లపల్లి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి గాయపడ్డాడు. ఈయన బైక్‌పై గాండ్లపెంట నుంచి బోలిగుట్లపల్లికి వెళ్తుండగా గ్రామ సమీపంలోని మలుపులో అదుపు తప్పి కింద పడ్డాడు. ఎడమ చేతికి గాయమైంది. వెనుక కూర్చున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రభాకరరెడ్డికి గాయమైంది. వీరిని కదిరిలోని ఆస్పత్రికి తరలించారు. బాధితులను ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పరామర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మాసికా మహోత్సవం



ఆరోగ్య సమస్యలపై కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రశాంతి

కనగానపల్లి: మామిళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మాసికా మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి కిశోర బాలికలకు నెలసరిలో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాలికల ఆరోగ్య ఎదుగుదల కోసం ఐరన్, ప్రోటీన్లతో కూడిన ఆకుకూరలు, సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం హేమలత, స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: మహిళల వ్యక్తిగత పరిశుభ్రతపై మంగళవారం అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కనగానపల్లిలో ఆయన మాట్లాడుతూ మహిళ రుతుక్రమం–ఆరోగ్య పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలతో ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో తిరుగుతూ రుతుక్రమం సమయంలో మహిళల్లో సంభవించే ఆరోగ్య సమస్యలు వాటి పరిష్కారంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. పలువురు సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామానాయక్

గాండ్లపెంట: కటారుపల్లి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రామానాయక్ మంగళవారం పరిశీలించారు. కూలీల మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోండి



ఎంఈఓ రాజేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూబి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ రాజేశ్వరికి మంగళవారం వినతిపత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక వసతులు సరిగ్గా లేకున్నా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. నోటు పుస్తకాలపై ప్రైవేటు పాఠశాలల పేర్లు ముద్రించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఎంఈఓ దృష్టికి తీసుకువచ్చారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

పెనుకొండ: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు యాడికి నాగరాజు, సుధాకర్‌గుప్తా, ప్రగతి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. 28 నుంచి జూన్ 2 వరకూ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. 30న రథోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.